క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. కమ్మ జన సేవాసంఘం వారు ఉభయకర్తలుగా వ్యవహరించిన ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, నాయకులు వెంకటరత్నంనాయుడు, మస్తాన్‌బాబు, మల్లికార్జున్‌నాయుడు, బక్కయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తత అవసరం



యల్లాయపాళెంలో అవగాహన ర్యాలీ చేస్తున్న అధికారులు

కొడవలూరు : డెంగీ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా మండలంలోని యల్లాయపాళెంలో స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి కావ్య మాట్లాడుతూ డెంగీ వ్యాధిపై అప్రమత్తత అవసరమని తెలిపారు. 'ఎడిస్' అనే పగటి దోమ ద్వారా డెంగీ వ్యాపిస్తుందన్నారు. ఈ దోమ మంచి నీరు నిల్వ ఉన్న చోట ఉత్పత్తవుతుందన్నారు. ఇంటి పరిసరాల్లో తొట్టెలు, పాత టైర్లు, కుండల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. తొలుత స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు కుష్ఠు(లెప్రసీ)ని ప్రాథమిక దశలోనే గుర్తించడంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్(డీపీఎంఓ) నరసారెడ్డి మాట్లాడుతూ శరీరంపై స్పర్శలేని మచ్చలుంటే లెప్రసీగా అనుమానించి వెంటనే పీహెచ్‌సీలో పరీక్ష చేసి నిర్ధారించాలన్నారు. ప్రాథమిక దశలో కుష్ఠును గుర్తించడం ద్వారా పూర్తిగా నివారించవచ్చని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ నాగరాజు, పీహెచ్ఎన్ విజయ, హెచ్ఎస్ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.


పోలేరమ్మకు విశేషాలంకరణ



వారాహి అలంకారంలో పోలేరమ్మ

మనుబోలు : మనుబోలు కోదండరామపురం దేవాంగుల వీధిలో కొలువైన పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు మంగళవారం వారాహి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆషాడ మాసం మంగళవారాన్ని పురస్కరించుకుని అర్చకుడు శ్రీనివాసులు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు జరిపించి ప్రత్యేక పూజలు చేశారు. ఉభయకర్తలుగా గంధ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు వ్యవహరించారు.

రైల్వేస్టేషన్లలో భద్రత కట్టుదిట్టం



మాట్లాడుతున్న విజయభాస్కర్‌రావు

నెల్లూరు(క్రైమ్): రొట్టెల పండగకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో రైల్వేస్టేషన్లలో భద్రతను కట్టుదిట్టం చేశామని నెల్లూరు రైల్వే డీఎస్పీ విజయభాస్కర్‌రావు తెలిపారు. బందోబస్తు విధుల నిమిత్తం హాజరైన నెల్లూరు, ప్రకాశం, గుంతకల్ పోలీస్ అధికారులు, సిబ్బంది, ఆర్పీఎఫ్ అధికారులతో సమావేశాన్ని నెల్లూరు రైల్వే పోలీస్‌స్టేషన్లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విధులను అప్రమత్తంగా నిర్వర్తించాలని సూచించారు. నెల్లూరు ప్రధాన, సౌత్, వేదాయపాళెం, వెంకటాచలం రైల్వేస్టేషన్లలో 87 మంది సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేసి నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. రంగనాయకులపేట గేట్, ఆత్మకూరు బస్టాండ్, నక్కలోళ్ల సెంటర్, సౌత్ రైల్వేస్టేషన్ల వద్ద ప్రమాదాలు జరగకుండా గస్తీని ముమ్మరం చేశామని వెల్లడించారు. స్టేషన్లలో రైళ్లు నిదానంగా వెళ్లేలా చర్యలు చేపట్టామని వివరించారు. నెల్లూరు రైల్వే సీఐ భుజంగరావు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌గౌడ్, నెల్లూరు, కావలి, సూళ్లూరుపేట ఎస్సైలు మాలకొండయ్య, అరుణకుమారి, శివసామ్య తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ లేక.. మురుగు పారక

పారిశుద్ధ్య నిర్వహణపై గ్రామ పంచాయతీలు దృష్టి సారించడం లేదు. మురుగు కాలువలను శుభ్రపరచడం, పరిశుభ్రమైన తాగునీటిని సరఫరా చేయడం వంటి మౌలిక అంశాలను సైతం అధికారులు పర్యవేక్షించడం లేదు. సర్పంచ్‌లు నిధులు లేవంటూ చేతులెత్తేస్తున్నారు. చాలా గ్రామాల్లో తాగునీరు కలుషితం అవుతున్నాయి. మురుగునీరు మంచినీటిలో కలుస్తున్నాయి. దీంతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని భీతిల్లుతున్నారు.

- గ్రామాల్లో లోపిస్తున్న పారిశుద్ధ్యం
- కలుషితమవుతున్న తాగునీరు
- విజృంభిస్తున్న దోమలు
- డయేరియాపై అప్రమత్తత అవసరం



పొదలకూరు : మంచినీటి కుళాయి వద్ద చేరిన మురుగు

పొదలకూరు : సర్వేపల్లి నియోజకవర్గంలో 117 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కోవూరు నియోజకవర్గంలో 83 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కొన్ని పంచాయతీల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండగా, మరికొన్ని పంచాయతీల్లో సర్పంచులు తమ సొంత నిధులతో పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నారు. మేజర్ పంచాయతీల్లో కూడా పారిశుద్ధ్యం లోపించి దోమల ఉధృతి పెరుగుతోంది. ప్రధానంగా మురుగు కాలువల పూడిక తొలగించకపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నట్టు స్థానికులు వెల్లడిస్తున్నారు. వచ్చేది వర్షాకాలం కావడం వల్ల చాలాచోట్ల వర్షపు నీరు నిల్వ చేరి మురుగుగా మారి దోమల ఉధృతి పెరుగుతోందంటున్నారు. పొదలకూరు పట్టణ నడిబొడ్డున ఉన్న వరవ కాలువ అధ్వానంగా ఉంది. నాలుగేళ్ల క్రితం పంచాయతీ ఆధ్వర్యంలో కాలువ పూడిక తొలగించడం వల్ల దోమల ఉధృతి తగ్గింది. పట్టణంలో ప్రధాన కాలువ పూడిక తరచుగా తొలగిస్తున్నా దోమలు అదుపులోకి రావడం లేదు. గ్రామాల్లో పేడదిబ్బలు ఇళ్ల మధ్యలో ఉండడం వల్ల పారిశుద్ధ్యం లోపిస్తున్నట్టు ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోర్లు, కుళాయిల వద్ద మురుగు చేరి అపరిశుభ్రంగా మారుతోంది. అయితే ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది నీటి కలుషితం, పారిశుద్ధ్య లోపం వల్ల డయేరియా ప్రబలుతుందని అవగాహన కల్పిస్తున్నారు. ఎంత అవగాహన కల్పించినా పారిశుద్ధ్యం మెరుగుపడడం లేదు.

ఉలికిపడ్డ ముత్తుకూరు

మండల కేంద్రమైన ముత్తుకూరు కోనేటిమిట్ట ప్రాంతం ఒక్కసారిగా ఉలికి పడింది. స్థానికంగా ఓ మహిళ డెంగీ బారిన పడడంతో స్థానికంగా తీవ్ర కలవరం రేగింది. ఇప్పటికే ఉమ్మడి నెల్లూరు జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో డెంగీ కేసులు నమోదైన నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. దీంతో తాజాగా ఓ మహిళ డెంగీ బారిన పడి ఆస్పత్రి పాలవడంతో స్థానిక ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. వెంటనే వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్థానికంగా పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. పల్లపుప్రాంతాల్లో నీరు చేరడంతో దోమలు వృద్ధి చెందినట్లు గుర్తించారు. మురుగునీరు నిల్వ లేకుండా ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఇదే పనులు ముందే చేపట్టి ఉంటే బాగుండేదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా, మండల స్థాయి అధికారులు గ్రామాల్లో పర్యటించి మురుగునీరు నిల్వ లేకుండా, స్వచ్ఛమైన తాగునీరు ప్రజలకు అందేలా చర్యలు చేపట్టాల్సి ఉంది.



పొదలకూరు పట్టణం మధ్యలో మురుగు కాలువ దుస్థితి



కోవూరులో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని జేసీ సేదు మాధవన్‌కు ఫిర్యాదు చేస్తున్న స్థానికులు



ముత్తుకూరు కోళ్లమిట్టలో మందు ద్రావకాన్ని పరిశీలిస్తున్న వైద్యాధికారులు



కోవూరు లక్ష్మీనగర్‌లో పూడిపోయిన కాలువ



కోవూరులో రోడ్డు పక్కనే వేసిన చెత్త చెదారాలు



కోవూరులో డంపింగ్ యార్డులా మారిన లక్ష్మీనగర్

అధ్వాన స్థితిలో పారిశుద్ధ్యం



ముత్తుకూరు మేజర్ పంచాయతీలో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. ఎక్కడ చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. మురుగు కాలువలు పూడిపోయాయి. దీనివల్ల విపరీతంగా దోమలు వృద్ధి చెందాయి. జ్వరాలు వ్యాపిస్తున్నాయి. కోనేటిమిట్టలో ఒక డెంగీ కేసు నమోదు కావడమే దీనికి నిదర్శనం. రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి లేకపోవడం మరో లోపం.

– షేక్.నవీద్, ఎంపీటీసీ సభ్యుడు, ముత్తుకూరు

మెరుగుపరచాలి



వడ్లపూడి పంచాయతీ పరిధిలో గత కొంత కాలంగా పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. మురుగు కాలువల్లో పూడిక తీయడం, బ్లీచింగ్ చల్లించడం లాంటి సాధారణ పనులు కూడా సక్రమంగా చేయడం లేదు. డ్రెయినేజీ వ్యవస్థ బాగా లేకపోవడంతో పలుచోట్ల మురుగునీరు నిల్వ చేరుతోంది. వర్షాకాలం కావడంతో అంటు వ్యాధులు ప్రబలుతాయని ఆందోళనగా ఉంది. పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలి.

– బత్తుల వెంకటేష్, గొట్లపాళెం

రోగాలబారి నుంచి కాపాడాలి



కోవూరు పంచాయతీ పరిధిలోని లక్ష్మీనగర్ రెండో వీధిలో ఉన్న కాలువ పూర్తిగా పూడిపోయింది. చిన్నపాటి వర్షం కురిసినా నీరు బయటకు పారకుండా అక్కడే నిల్వ ఉంటోంది. దీంతో దోమలు పెరిగి రోగాల బారిన పడుతున్నాం. ఇదే విషయమై సోమవారం జాయింట్ కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశాం. మా సమస్యను పరిష్కరించి ఇక్కడి ప్రజలను అంటూ రోగాలబారి నుంచి కాపాడాలి.

– పి.సుధాకర్‌రెడ్డి, కోవూరు

డ్రెయిన్‌లు పూడిపోయాయి



కోవూరు లక్ష్మీనగర్ పరిసర ప్రాంతాల్లో సైడు డ్రెయిన్‌లు పూడిపోయాయి. వర్షం కురిస్తే మురుగు నీరు నిల్వ చేరిపోతోంది. దీంతో స్థానికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రస్తుతం రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో ఇళ్ల వద్ద మురుగు చేరింది. అధికారులు, పాలకులు స్పందించి కాలువల పూడిక తీయాలి.

– కె.లుక్సన్, కోవూరు

అధ్వానంగా వీధులు



ఇక్కడ మురుగునీరు పారక పోవడంతో వీధులు అధ్వానంగా మారుతున్నాయి. వర్షాలు పడ్డాయంటే దోమల ఉధృతి తీవ్రంగా ఉంటోంది. అధికారులు ముందస్తు చర్యలు చేపట్టకపోతే ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది.

– కె.సంజయ్‌కుమార్, కోవూరు

ఆదర్శప్రాయులు కవి శేషేంద్రశర్మ



గుంటూరు శేషేంద్రశర్మ చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

తోటపల్లిగూడూరు : ప్రముఖ కవి దివంగత గుంటూరు శేషేంద్రశర్మ ఆదర్శప్రాయులని స్థానిక ఎంపీడీఓ, చిత్తూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పలమనేరు బాలాజీ అన్నారు. అంతర్జాతీయంగా కీర్తి గడించిన కవి గుంటూరు శేషేంద్రశర్మ స్వగ్రామమైన తోటపల్లిగూడూరులోని వారి స్వగృహంలో ఆయన చిత్రపటాన్ని మంగళవారం జిల్లా గ్రంథాలయ శాఖ అధికారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలమనేరు బాలాజీ మాట్లాడుతూ సాహిత్యంలో గుంటూరు శేషేంద్రశర్మ సేవలు ఎనలేనివన్నారు. ఆయన రచనలు ఎందరో కవులకు ఆదర్శవంతంగా నిలిచినట్లు తెలిపారు. జిల్లా గ్రంథాలయశాఖ కార్యదర్శి కుమార్‌రాజా మాట్లాడుతూ తన సాహిత్యంతో ప్రజల మనస్సు చూరగొన్న గుంటూరు శేషేంద్రశర్మ పేరును జిల్లా గ్రంథాలయానికి నామకరణం చేసేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లా రచయితల సంఘం వారు దాదాపు 150 పుస్తకాలను బహుమతిగా ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కవులు ఈతకోట సుబ్బారావు, పోతూరి అన్నపూర్ణ, గోవిందరాజుల సుభద్రాదేవి, పెరుగు రామకృష్ణ, అవ్వారు శ్రీధర్‌బాబు, పాయసం సుబ్రహ్మణ్యం, గుండాల నరేంద్రబాబు, శ్రీమన్నారాయణ, వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



దర్గాలో అలంకరించిన హజరత్ ఇమాం, హజరత్ అబ్బాస్ పీర్లు



ముస్తాబైన దర్గా

- నేడు కాగితాలపూరులో మాతం

మనుబోలు : మండలంలోని కాగితాలపూరు గ్రామంలో మొహర్రం వేడుకలను వారం రోజులుగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. గ్రామంలోని రెండు ప్రధాన దర్గాలను నలుపు రంగు కాగితాలతో ముస్తాబు చేశారు. హజరత్ ఇమాం, హజరత్ అబ్బాస్ పీర్లను ముస్తాబు చేసి దర్గాల్లో కొలువుదీర్చారు. ఈ క్రమంలో ముస్లింలు మంగళవారం ఉపవాసాల ఉండి అగ్నిగుండ ప్రవేశం చేశారు. టీడీపీ నేత సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ముస్లిం మత పెద్దల ఆహ్వానం మేరకు దర్గాలను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చివరి రోజైన బుధవారం మాతం(రెండు వేళ్ల మధ్య బ్లేడు ఉంచుకుని చాతిపై కొట్టుకోవడం) చేస్తూ రక్తం చిందిస్తారు. ఈ వేడుకను చూసేందుకు జిల్లా నలుమూలల నుంచే కాకుండా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, దుబాయి, కువైట్ తదితర ప్రాంతాల్లో స్థిరపడిన ముస్లింలు హాజరవుతారు.

మహాసభల కరపత్రాల ఆవిష్కరణ

నెల్లూరు (టౌన్): ఏపీటీఎఫ్ విద్యా, వైజ్ఞానిక మహాసభల కరపత్రాలను డీఈఓ రామారావు, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి మంగళవారం ఆవిష్కరించారు. నగరంలోని డీఈఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి మాట్లాడారు. ఏపీటీఎఫ్‌ను స్థాపించి 80 ఏళ్ల పూర్తయిన సందర్భంగా నగరంలోని టౌన్‌హాల్లో మహాసభలను వచ్చే నెల పదిన నిర్వహించనున్నామని వివరించారు. ఏపీటీఎఫ్ బాధ్యులు పిచ్చిబాబు, రియాజ్, కృష్ణారెడ్డి, జుల్ఫికర్ అలీ, కోటేశ్వరరావు, సుబ్బారెడ్డి, కరీమ్ మొహిద్దీన్, వెంకటేశ్వర్లురెడ్డి, రామసుబ్బారెడ్డి, సులోచనమ్మ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు

- ఏడీఏ శివనాయక్

పొదలకూరు : అర్హులైన కౌలు రైతులకు సీసీఆర్ కార్డులను అందజేస్తామని పొదలకూరు ఏడీఏ కె.శివనాయక్ పేర్కొన్నారు. మండలంలోని సూరాయపాళెంలో సీసీఆర్ కార్డులపై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ 36 రెవెన్యూ గ్రామాల్లో పంటసాగు హక్కు పత్రాలను అందజేస్తామని తెలిపారు. మండలంలో 1,364 పంట సాగు హక్కు పత్రాలను అందజేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. సీసీఆర్ కార్డుల ద్వారా పట్టాదారునికి ఎలాంటి నష్టం వాటిల్లదని చెప్పారు. సాగుదారులకు కేవలం పండించిన పంటపై మాత్రమే హక్కు ఉంటుందన్నారు. కార్డులు కలిగిన వారు సబ్సిడీ విత్తనాలు, బ్యాంకు రుణాలు, పంట నష్ట పరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు. కార్డుకు అర్హత 11 నెలలు మాత్రమే ఉంటుందని, భూ యజమానులు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. సీసీఆర్ కార్డులు కావల్సిన రైతులు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు. ఈ సదస్సుల్లో ఏఓ ఎ.వాసు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏడీఏ శివనాయక్

విధిగా పొందాలి

కొడవలూరు : కౌలు రైతులు సీసీఆర్(పంట సాగుదారు హక్కు) పత్రాలను విధిగా పొందాలని ఏఓ లక్ష్మి సూచించారు. మండలంలోని నార్తురాజుపాళెంలో సీసీఆర్ కార్డులపై మంగళవారం కౌలు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌలు రైతులు వ్యవసాయశాఖ రాయితీలు పొందాలంటే విధిగా సీసీఆర్ కార్డు కలిగి ఉండాలన్నారు. అంతేకాకుండా పంట నమోదు చేయించుకుని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించుకోవచ్చని సూచించారు. అనంతరం గ్రామంలో మంజూరు చేసిన సీసీఆర్ కార్డులను ఏఓ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓ ఎ.అనూష, పంచాయతీ కార్యదర్శి జి.జాలయ్య, వీఆర్వోలు మల్లికార్జున, ప్రియదర్శిని, వీఏఏ డి.శివజ్ఞాన తదితరులు పాల్గొన్నారు.

కచ్చితంగా పొందాలి

విడవలూరు : కౌలు రైతులు సీసీఆర్ కార్డులను కచ్చితంగా పొందాలని మండల వ్యవసాయాధికారి పి.వెంకట కృష్ణయ్య అన్నారు. మండలంలోని వావిళ్ల, గాదెలదిన్నె గ్రామాల్లోని కౌలు రైతులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వీఆర్వో కుమార్, వీఏఏ వి.చరణ్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

అనేక ప్రయోజనాలు

తోటపల్లిగూడూరు : సీసీఆర్ కార్డులతో కౌలు రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని మండల ఏఓ శిరీషారాణి అన్నారు. మండలంలోని కోడూరు బిట్–1, కోడూరు బిట్–2, ముంగళదొరువు రైతు భరోసా కేంద్రాల్లో సీసీఆర్ కార్డులపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ రాయితీల గురించి వివరించారు. తోటపల్లిగూడూరు మండలంలో 1,091 మంది కౌలు రైతులకు సీసీఆర్ కార్డులను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు దయానా, శశి, కుసుమ పాల్గొన్నారు.



కొడవలూరు : అవగాహన కల్పిస్తున్న ఏఓ లక్ష్మి



విడవలూరు : మాట్లాడుతున్న ఏఓ వెంకటకృష్ణయ్య



తోటపల్లిగూడూరు : మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

ఆర్టీసీ ఆర్ఎంను కలిసిన నేతలు

నెల్లూరు సిటీ: నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్టీసీ ఆర్ఎం విజయరత్నాన్ని ఏపీపీటీడీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నేతలు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ, జిల్లా అధ్యక్షుడు కేపీ రెడ్డి మాట్లాడారు. అసోసియేషన్ తరఫున అన్ని విధాలా సహాయ, సహకారాలను అందిస్తామని తెలిపారు. నేతలు శశికుమార్‌రెడ్డి, ఇస్మాయిల్, సుబ్బారావు, వెంకటేష్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించాలి

ఇందుకూరుపేట : కుష్ఠువాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారులు డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు, కిశోర్‌కుమార్ తెలిపారు. మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బందికి ఆశా వర్కర్లకు కుష్టు వ్యాధిపై శిక్షణా కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారులు పలు సూచనలు చేశారు. ఎవరికైనా కుష్టు వ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యసిబ్బందిని సంప్రదించాలని తెలియజేశారు. సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఈఓ శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్లు రమా, సతీష్ బాబు, ఫార్మసీ ఆఫీసర్ చంద్రశేఖర్, హెల్త్ ఎడ్యుకేటర్ అరుణ, సీహెచ్ఓలు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారులు

అనుమతుల్లేని కళాశాలల సీజ్‌కు వినతి

నెల్లూరు (టౌన్): ఇంటర్ బోర్డు నిబంధనల మేరకు అనుమతుల్లేని జూనియర్ కళాశాలలను సీజ్ చేయాలని పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నరహరి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్ఐఓ కార్యాలయంలో ఆర్ఐఓ శ్రీనివాసులుకు వినతిపత్రాన్ని మంగళవారం సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. అడ్మిషన్లు, తరగతులను ప్రారంభించాక పలు కళాశాలల యాజమాన్యాలు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. అనుమతుల్లేకుండా ఏర్పాటు చేసిన కళాశాలల యాజమాన్యాలపై విచారణ జరిపి కేసులను నమోదు చేయాలని కోరారు. అసోసియేషన్ జిల్లా నేతలు శ్రీనివాసులురెడ్డి, రాజాయాదవ్, మహేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.